Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

www.nityamnigha.com


NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts





వరంగల్ | సంపుటి 2 | సంచిక 70 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం 11.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..
సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ



- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్టాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. .....

2

డీపీలపై సీఎం రేవంత్ కీలక హామీ
ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

- ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు
- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ
- పీఆర్‌సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు
- ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ

నిత్యం నిఘా, హైదరాబాద్ : ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు....

2



రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంటి..?
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



నిత్యం నిఘా, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు. ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.

అనుముల సోదరులకు 1250 కోట్లు ఇవ్వడమేనా ప్రజాపాలన..? - కేటీఆర్



- రేవంత్ రెడ్డి సొంత సోదరులకే తెలంగాణను దోచిపెడుతున్నారు: కేటీఆర్
- ఫోర్త్ సిటీలో రూ. 200 కోట్ల విలువైన భూమి తమ్ముడి కంపెనీకి ధారాదత్తం
- ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..

కాంగ్రెస్ అవినీతిని ప్రజాక్షేత్రంలోనే తేలుస్తాం!

నిత్యం నిఘా, ఫోర్త్ సిటీ : అమెరికా పర్యటనలో సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకొని రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి కంపెనీ టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకు కట్టబెట్టింది. ఫోర్త్ సిటీలో అక్రమంగా కట్టబెట్టిన భూమిని హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ది గ్రేట్ అనుముల రేవంత్ రెడ్డితో ది గ్రేట్ పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్ రెడ్డితో రూ.1000 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాడు. ఇలా అనుముల జగదీశ్వర్ రెడ్డికి రూ.1000 కోట్లు, అనుముల కొండల్ రెడ్డికి రూ.250 కోట్లు ఇవ్వడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. అనుముల అన్నదమ్ముల దోపిడీ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని బీజేపీ వాళ్ళు అంటారు.. మరి దొంగని పట్టుకోవాల్సిన కేంద్ర హోమ్ మంత్రి ఎక్కడ ఉన్నాడని సూటిగా ప్రశ్నించారు. ఇజ్రాయెల్ తో ఒప్పందం చేసుకుంటే రాహుల్ గాంధీ మోడీని ప్రశ్నించాడు.. అదే రేవంత్ రెడ్డి ఇజ్రాయెల్ తో ఒప్పందం చేసుకుంటే నువ్వు ఎందుకు ప్రశ్నించడం లేదు, ఎందుకు ఈడీ విచారణకు, సీబీఐ విచారణకు ఆదేశించడం లేదన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని చూసి పొంగులేటి కూడా రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ అని స్టార్ట్ చేశాడు. ఇలా కాంగ్రెస్ అవినీతి, అక్రమాలను శాసనసభలో ప్రశ్నిస్తారనే భయపడి మమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఇలాంటి వాటికి భయపడమని ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు.

కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

- మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్
- అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపు ల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..

2

ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది : భట్టి విక్రమార్క

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం



2

రేవంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం - హరీశ్‌రావు

- కాంగ్రెస్ పార్టీ ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా దాడి చేస్తోందన్న హరీశ్
- ఫేక్ అకౌంట్లలోని పోస్టులను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారని మండిపాటు
- సభకు, ప్రజలకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



2

Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 2

బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..

ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

మొదటిపేజీ తరువాయి.. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మొదటిపేజీ తరువాయి.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్ల భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి పెట్రోల్ బంక్‌ను ఢీకొట్టిన బస్సు.. తప్పిన పెను ప్రమాదం



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ శివార్లలో టీజీఎస్ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన బస్సు వేగంగా ఓ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లడంతో అక్కడున్న వాహనాలు, యంత్ర పరికరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం నుంచి సిబ్బంది, ప్రయాణికులు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ వైపు వెళుతుండగా, మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ బస్సును పక్కకు మళ్లించాడు. అయితే, బస్సు అధిక వేగంతో ఉండటంతో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బంక్‌లో ఆగి ఉన్న ఒక కారు పూర్తిగా ధ్వంసం కాగా, మరో వాహనం పాక్షికంగా దెబ్బతింది. బస్సు నేరుగా డీజిల్ ఫిల్లింగ్ పాయింట్‌ను ఢీకొట్టడంతో అక్కడి యంత్ర పరికరాలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఓ పెట్రోల్ పంప్ ఎగిరిపడింది. ఒక్కసారిగా బస్సు దూసుకురావడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది, వాహనదారులు భయాందోళనలతో పరుగులు తీశారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలన్నీ అక్కడ ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు.. సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ



మొదటిపేజీ తరువాయి.. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది : భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/ సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

వంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం : హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

22ఏ భూములపై చర్చకు డిమాండ్.. మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 3

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం



హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ వీరనారి, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ధైర్యం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, ప్రదర్శించిన తెగువ చిరస్మరణీయమని కొనియాడారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల హక్కుల సాధనకు పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

క్రైస్తవ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలి



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథని పట్టణంలో క్రైస్తవ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంథని డివిజన్ పాస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు పాస్టర్ శ్రీనివాస్ పాల్ మాట్లాడుతూ.. మంథని పట్టణంలో క్రైస్తవ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే భవన నిర్మాణానికి అనువైన స్థలం అందుబాటులో లేకపోవడంతో పనులు ప్రారంభించలేకపోతున్నామని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి మంథని పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి క్రైస్తవ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ శ్రీనివాస్ పాల్, ఎ. జోసెఫ్, ఎం. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఐక్యతకు కృషి చేయాలి

వరంగల్, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఐక్యత, కుల సమైక్యతను చాటేందుకే తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ తెలిపారు. వరంగల్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధ్యాన మందిరంలో వరంగల్, హనుమకొండ జిల్లాల విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఎన్నికల సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తూములూరి సత్యనారాయణ మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులందరూ సంఘంలో భాగస్వాములై ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీలను పూర్తి చేసి, భారీ స్థాయిలో రాష్ట్ర మహాసభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి, ఐజేయూ జిల్లా కోశాధికారి డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీలు జర్నలిస్టుల సంక్షేమంతో పాటు విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి ఓదెల సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కలకోటి వీరభద్రయ్య చారి నిర్వహణకర్తలుగా వ్యవహరించారు.



నూతన జిల్లా కమిటీల ఎన్నిక

రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ప్రకటించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కుంటమల్ల అరవింద్, ప్రధాన కార్యదర్శిగా మునిగంటి అమరేందర్, ఉపాధ్యక్షుడిగా అకోజు సాంబయ్య, కోశాధికారిగా ఆర్. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఉల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా దెంచనాల రాజు, కోశాధికారిగా పొడిచెట్టి రమేష్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్ ప్రమాణ స్వీకారం చేయించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండలోజు కృష్ణ ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వడ్ల ప్రవీణ్ చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు సర్వేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందాచారి, ప్రధాన కార్యదర్శి జి. పెంటయ్య చారి, సుగ్రీవ చారి, బ్రహ్మాచారి, శ్రీనివాస్, కిరణ్, మహేష్, శ్రవణ్, పూర్ణచందర్, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట శాశ్వత బస్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాజీపేటలో ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రతిపాదిత శాశ్వత ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం పరిశీలించారు. రైల్వే శాఖకు చెందిన ప్రతిపాదిత భూములను ఆర్టీసీ, రెవెన్యూ, రైల్వే అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రస్తుతం సిటీ బస్సుల రాకపోకలు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ ముందు ఉన్న స్థలం, రైల్వే పాఠశాల స్థలం, రైల్వే స్టేడియం ప్రాంతంతో పాటు స్టేడియానికి ఎదురుగా ఉన్న రైల్వేకు చెందిన సుమారు ఎకరం భూమిని కలెక్టర్ పరిశీలించారు. అలాగే కాజీపేట ప్రధాన రహదారి పక్కన హైదరాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిచే ప్రస్తుత బస్టాండ్‌ను కూడా పరిశీలించారు. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో శాశ్వత బస్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని రైల్వే శాఖ ద్వారా సమకూర్చుకోవడం, ఇరు శాఖల మధ్య భూమి మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేలా అనువైన స్థలాన్ని ఎంపిక చేయడంపై అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం కిషన్‌రావు, డీఎం ధరమ్‌సింగ్, కాజీపేట తహసీల్దార్ రాజు, రైల్వే శాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ శ్రీనివాస్, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



పత్తిలో అధిక దిగుబడులకు ఆధునిక సాగు పద్ధతులు

- క్రిస్టల్ కాటన్ ఫీల్డ్ డేలో రైతులకు అవగాహన

ములుగు జిల్లా /జేడీ మల్లంపల్లి, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : పత్తి సాగులో ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. జేడీ మల్లంపల్లి మండల పరిధిలో పత్తి సాగు చేస్తున్న రైతుల పొలాల్లో క్రిస్టల్ కాటన్ ఆధ్వర్యంలో ఫీల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంట యాజమాన్యం, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.పత్తి మొక్కల ఎదుగుదల, పూత, కాయల ఏర్పాటును పరిశీలించిన నిర్వాహకులు.. ప్రస్తుతం పంట ఏపుగా పెరిగి, మంచి సంఖ్యలో కాయలు ఏర్పడటంపై రైతులతో చర్చించారు. పంటలో పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి, వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. క్రిస్టల్ కాటన్ విత్తనాల పంపిణీదారుగా ఉన్న నాగార్జున ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ యజమాని ప్రసాద్‌రావు కార్యక్రమంలో పాల్గొని రైతులకు విత్తనాల ప్రత్యేకతలు, పత్తి సాగులో పాటించాల్సిన పద్ధతులు, దిగుబడిని పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు తమ పొలాల్లో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటికి తగిన సూచనలు, సలహాలు అందించారు.పత్తి పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అవసరమైన సమయంలో సరైన పంట యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులకు క్షేత్రస్థాయిలో నేరుగా అవగాహన కల్పించేందుకు ఫీల్డ్ డే కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, క్రిస్టల్ కాటన్ ప్రతినిధులు, నాగార్జున ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ యజమాని ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.





చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

కరీంనగర్ జిల్లా, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిర్భయంగా పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక ఐలమ్మ అని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా తన హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ చూపిన బాటలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని చైర్మన్ తెలిపారు. జమ్మికుంట పట్టణ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు కొలుగూరి సురేష్, ఫిరోజ్, పీఏసీఎస్ చైర్మన్ పోనగంటి సంపత్, రజక సంఘం అధ్యక్షుడు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.



Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 4

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గణేష్ మండపాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి



ములుగు జిల్లా, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్ సూచించారు. అనుమతి లేకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేయవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవని స్పష్టం చేశారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు గణేష్ మండపాల ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మండపాలు ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగానే ములుగు పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన మండపాల వివరాలను పోలీసులు నమోదు చేసుకుని, అక్కడ భద్రతా చర్యలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగలు, రాత్రి బీట్ నిర్వహించడంతో పాటు నిరంతరం పోలీసు పెట్రోలింగ్ చేపడతామని తెలిపారు. యువత అత్యుత్సాహానికి దూరంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని డీఎస్పీ హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ దారం సురేష్, ఎస్సై ఎస్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మగడ్డ తండాకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి



జనగామ జిల్లా/పాలకుర్తి, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : పాలకుర్తి మండల పరిధిలోని అయ్యంగారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎల్లమ్మగడ్డ తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ తండా నాయకులు గురువారం ఎమ్మెల్యేను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్లమ్మగడ్డ తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తండా ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయడం వల్ల పరిపాలనా సేవలు మరింత చేరువవుతాయని వివరించారు. ఈ అంశంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోతు రమేష్, ఉపసర్పంచ్ నున్నావత్ సునీల్, బానోతు భోజ్యా, బానోత్ ఆంజి, బానోత్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

ఏటూరునాగారం, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏటూరునాగారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షుడు పర్వతాల ఎల్లయ్య చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు, సాగించిన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రజకుల హక్కుల సాధన కోసం ప్రతి గ్రామంలో ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఐక్యంగా ముందుకు సాగుతూ హక్కుల సాధన దిశగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. రజకులు తమ హక్కులపై చైతన్యంతో ముందుకు సాగాలని, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కుదురుపాక రాజేష్, పర్వతాల కుమారస్వామి, పర్వతాల నర్సయ్య, చింతలపల్లి సుమన్, పర్వతాల రమేష్, రమేష్ (పెద్దోడు), కుమ్మరికుంట్ల సతీష్, కుదురుపాక గిరిబాబు, పర్వతాల రత్తమ్మ, వార్డు సభ్యులు అంగాల వీరన్న, గంప సాయి కిరణ్, పెద్దబోయిన బాలకృష్ణ, బట్టు గోపి, కూనూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల చెర నుంచి ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించాలి



హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : హనుమకొండ జిల్లాలో కబ్జాదారుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని, అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హనుమకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భిక్షపతి మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు సొంత ఇల్లు, సెంటు భూమి కూడా లేని వేలాది మంది పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆక్రమణదారుల నుంచి భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కబ్జాలకు సహకరిస్తున్న అధికారులు, అక్రమార్కులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ అధికారులకు అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోకపోతే.. బాధితులు, పేదలతో కలిసి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, భూ పోరాటాలు చేపడతామని భిక్షపతి హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ యువజన అవార్డు గ్రహీతల సంఘానికి నూతన కమిటీ



హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన యువతను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ప్రతి ఏటా అందజేస్తున్న జాతీయ యువజన పురస్కార గ్రహీతల తెలంగాణ రాష్ట్ర సంఘానికి నూతన కమిటీ ఎన్నికైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన నరహరి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్‌కు చెందిన డా. నారా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండలోని బిర్లా ఓపెన్ మైండ్స్ సమావేశ మందిరంలో జరిగిన ఎన్నికల కార్యక్రమానికి జాతీయ యువజన అవార్డు గ్రహీతల సీనియర్ సభ్యుడు మండల పరశురాములు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 1985 నుంచి ఇప్పటివరకు తెలంగాణ నుంచి 34 మంది యువత జాతీయ యువజన పురస్కారాలను అందుకున్నారని నిర్వాహకులు తెలిపారు. సీనియార్టీ ప్రకారం ప్రతి ఏటా సంఘం అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేసుకునే ఆనవాయితీలో భాగంగా ఈసారి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నరహరి సుధాకర్‌రెడ్డి గతంలో నెహ్రూ యువ కేంద్రం, యువజన సేవల శాఖ ద్వారా యువత సంక్షేమం కోసం పనిచేశారు. శాంతి సర్వీస్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి నాబార్డ్ ద్వారా రైతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం లయన్స్ క్లబ్ 320ఎఫ్ జిల్లా గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. ఆయన ఒక సంవత్సరం పాటు రాష్ట్ర అధ్యక్ష పదవిలో కొనసాగనున్నారు.

నూతన కార్యవర్గం

ప్రధాన కార్యదర్శిగా డా. నారా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రెండ్ల కలింగ శేఖర్, డా. కందేరావు సుధారాణి, బండారు లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా ఏ. కిరణ్‌కుమార్, కోశాధికారిగా డా. ఆకులపల్లి మధు, మీడియా ఇన్‌చార్జిగా అల్వాల విష్ణు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డా. దేశ బోయిన నరసింహులు, తగరపు సత్యం, గంజి రాజేందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర అధ్యక్షుడు నరహరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర యువజన విధానాన్ని ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల యువతను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేలా యువజన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి స్వయం ఉపాధి, విద్య, క్రీడలు, సామాజిక సేవ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించాలని సూచించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతల సంఘం యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జాతీయ యువజన అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో మేరా యువ భారత్ విభాగం జిల్లా సమన్వయకర్త భూక్య సంజీవ్ నాయక్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు జాతీయ యువజన అవార్డు గ్రహీతలు పాల్గొని యువత అభివృద్ధి, ప్రభుత్వ పథకాల్లో యువత భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ఏటూరునాగారం, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో ఏపీఓను కలిసి విద్యార్థుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచి, నిధులను సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఖండించాల్సిన విషయమన్నారు. అనేక గిరిజన ఆశ్రమ పాఠశాలల భవనాల్లో తలుపులు, కిటికీలు సక్రమంగా లేవని, వర్షం కురిసినప్పుడు తరగతి గదుల్లోకి నీరు చేరుతోందని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయడంతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రి అందించాలని కోరారు. గిరిజన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సరైన వసతి సౌకర్యం కల్పించాలని, ములుగు జిల్లా పరిధిలోని వలస ఆదివాసీ కుటుంబాల సమస్యలను పరిష్కరించి అర్హులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ ప్రధాన డిమాండ్లు

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం, మెస్ ఛార్జీలు పెంచి సకాలంలో నిధులు విడుదల చేయడం, విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టడం, కళాశాల విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించడం, అర్హులైన వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పట్ల మధు, పైసా గణేష్, ఉమ్మడి జిల్లా నాయకులు అమీర్, జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు, మండల కార్యదర్శి బట్ట స్వామి, టౌన్ కార్యదర్శి సిద్ధు, నాయకులు సాంబశివరావు, గణేష్, సమీర్, దేవేందర్, యశ్వంత్, సాయి చరణ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 5

చదరంగంలో మేధావి.. ఆధ్యాత్మికతలో సాధకుడు

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథని ప్రాంతంలో చదరంగం ఆటకు విశేష ప్రోత్సాహం అందించిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మిక చింతనాపరుడు రామడుగు ప్రభాకర్ (90) కన్నుమూశారు. ఆయన మృతి పట్ల మంథని ప్రాంతానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, క్రీడాభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చదరంగంపై అపారమైన ఆసక్తి, పట్టుతో ప్రభాకర్ ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచారు. మంథనిలో చదరంగాన్ని ప్రోత్సహించడంతో పాటు పలువురిలో ఈ ఆటపై ఆసక్తిని పెంపొందించారు. ఆయన కున్న ప్రావీణ్యాన్ని గుర్తించిన పలువురు అప్పట్లో ప్రేమతో 'గ్రాండ్ మాస్టర్'గా పిలిచేవారు. జీవితంలో ఎన్ని బాధ్యతలు ఉన్నా చదరంగాన్ని మాత్రం వదలకుండా, ఆటలోనే ఆనందాన్ని వెతుక్కునేవారని సన్నిహితులు గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన పూర్తిగా ఆధ్యాత్మిక చింతన వైపు మళ్లారు. మంథనిలోని హరే రామ హరే కృష్ణ ఆశ్రమ స్థాపకుడిగా కొనసాగుతూ ప్రతిరోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. నిరాడంబరమైన జీవనశైలితో అందరితో ఆప్యాయంగా మెలుగుతూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రభాకర్‌కు భార్య రాధామణి, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ మంచిర్యాల సాయిబాబా ఆలయంలో 35 ఏళ్ల పాటు పూజారిగా సేవలందించారు. ప్రస్తుతం మంథనిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో అర్చకుడిగా సేవలందిస్తున్నారు. చిన్న కుమారుడు ఖతర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. చదరంగానికి ప్రోత్సాహం అందించిన క్రీడాభిమాని, విద్యాబోధనలో తనదైన ముద్ర వేసిన ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మికతలో నిత్యం జీవించిన సాధకుడిగా రామడుగు ప్రభాకర్ సేవలు మంథని ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని



పలువురు పేర్కొన్నారు. ఆయన మృతి మంథని ప్రాంతానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.

చిట్యాల ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



వరంగల్, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రంగసాయిపేట జంక్షన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని సామాజిక సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్, రజక విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కత్తెరపల్లి దామోదర్, జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, మైదం సంజీవ్, టీఆర్ఎస్ నాయకుడు కోల గోపాల్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఉసిల్ల కుమార్, కలకోట్ల కుమారస్వామి, బజ్జూరి లక్ష్మణ్, పూజారి విజయ్, గాదె కిరణ్, మైదం రూప, బొజ్జం మంజుల తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని మంథని పోలీసులు గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ఈ మేరకు మంథని సీఐ బుద్ధ స్వామి, ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంథని తహసీల్దార్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రతి బహిరంగ గణేష్ మండపం, ఊరేగింపునకు సంబంధించిన వివరాలను పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో ముందుగానే నమోదు చేయాలని పోలీసులు సూచించారు. విద్యుత్ కనెక్షన్‌ను సంబంధిత శాఖ అధికారుల అనుమతితోనే తీసుకోవాలని, విద్యుత్ తీగలకు అక్రమంగా కనెక్షన్లు ఇవ్వవద్దని హెచ్చరించారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద గరిష్ఠంగా రెండు చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి 10 గంటల తర్వాత శబ్ద పరికరాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. భజన కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించారు. ప్రతి మండపం వద్ద నిరంతరం కనీసం ముగ్గురు స్వచ్ఛంద సేవకులు అందుబాటులో ఉండాలని, వారి పేర్లను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. మండపాల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి దృశ్యాలు భద్రపరిచేలా నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా రాజకీయ నినాదాలు చేయడం, మద్యం సేవించడం, అదృష్ట పరీక్షల పేరుతో బహుమతుల



కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల నుంచి బలవంతంగా చందాలు వసూలు చేయడం పూర్తిగా నిషేధమని పోలీసులు స్పష్టం చేశారు. విగ్రహాల నిమజ్జనాన్ని ప్రభుత్వం, అధికారులు గుర్తించిన స్థానిక చెరువులోనే నిర్వహించాలని సూచించారు. ప్రతి గణేష్ విగ్రహానికి ఒక వాహనం మాత్రమే వినియోగించాలని, విగ్రహాన్ని తరలించే వాహనంపై డీజే బాక్సులు ఏర్పాటు చేయడం, నృత్య ప్రదర్శనలు నిర్వహించడం చేయరాదని స్పష్టం చేశారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల సూచనలు, నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించి గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని అధికారులు కోరారు.

చాకలి ఐలమ్మ పోరాటం.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంథనిలోని ఆమె విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కనవేనా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గొప్ప వీరనారి అని కొనియాడారు. నాటి నిజాం పాలనలో దొరల పెత్తనం, వెట్టిచాకిరీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఐలమ్మ అన్యాయానికి తలవంచకుండా, భయపడకుండా పోరాటం చేసి వేలాది మందికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. తన భూమి, తన హక్కు కోసం దొరల దౌర్జన్యాలను ఎదిరించిన ఆమె ధైర్యం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం కేవలం వ్యక్తిగత హక్కు కోసం సాగినది కాదని, పేదలు, రైతులు, కూలీలు, మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో సాగిన ఉద్యమ



మని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహిళలు సైతం అన్యాయాన్ని ప్రశ్నించి సామాజిక మార్పులో కీలక పాత్ర పోషించగలరని ఐలమ్మ నిరూపించారని తెలిపారు. ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆమె త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఐలమ్మ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ శాయంపేటలో ఘనంగా పోచమ్మ బోనాల ఉత్సవాలు

హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : హనుమకొండ నగరంలోని న్యూ శాయంపేట 31వ డివిజన్‌లో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, వేల్పుల మోహన్‌రావు ప్రత్యేక ఆహ్వానం మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. న్యూ శాయంపేట 31వ డివిజన్ ప్రజలతో



పాటు హనుమకొండ జిల్లా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ మాస్టర్ ట్రైనింగ్ కమిటీ సభ్యుడు మారంరెడ్డి కౌటిల్‌రెడ్డి, వేల్పుల రోహిత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

దళిత బాంధవుడు కేసీఆర్ : చదిరం నాగేశ్వరరావు



హన్మకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : దళితుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని బీఆర్ఎస్ నాయకుడు చదిరం నాగేశ్వరరావు అన్నారు. దళిత బంధు పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో దళితబంధు పథకాన్ని అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సుమారు రూ.145 కోట్ల వ్యయంతో నిర్మించడంతో పాటు, నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం కేసీఆర్ ప్రభుత్వానికి అంబేద్కర్‌పై ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.

కేసీఆర్ నివాసం వద్ద నిరసనలపై ఆగ్రహం

కేసీఆర్ నివాసం వద్ద ఇటీవల జరిగిన నిరసనలపై నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ చావును కోరుకునే విధంగా నినాదాలు చేయడం, దళితులను ముందుపెట్టి ఆయన నివాసం వద్ద నిరసనలు నిర్వహించడం హేయమైన చర్య అని ఆరోపించారు. దళితులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, వారిని చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఉసిగొల్పడం సరికాదని అన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి గౌరవం ఇవ్వాలి

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని నాగేశ్వరరావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించలేదని ఆరోపించారు. అంబేద్కర్ ఆశయాల అమలు, దళితుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మరింత కృషి చేయాలని డిమాండ్ చేశారు. దళితులను రాజకీయాలకు ఉపయోగించుకోవడం మానుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఇలాంటి చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా దళితులను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్, ఆరేపల్లి రాజయ్య, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తీక్, శనిగరం వంశీ తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 6

సచివాలయంలో ఏసీబీ కలకలం..

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఇద్దరు పట్టివేత



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర సచివాలయ ఆవరణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. సచివాలయం లో అవుట్ సోర్సింగ్ సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. మెడికల్ క్లెయిమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2 లక్షల మొత్తానికి చెక్కు మంజూరు చేయించేందుకు ఫిర్యాదుదారుడి నుంచి ఇద్దరు ఉద్యోగులు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగిన సిటీ రేంజ్ ఏసీబీ అధికారులు సచివాలయ ఆవరణలో వల పన్ని, లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో వినోద్, రాఘవేంద్రను పట్టుకున్నట్లు తెలిపారు. సచివాలయ ఆవరణలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడంతో కొంతసేపు కలకలం నెలకొంది. ఇద్దరు నిందితులను ప్రాథమిక దర్యాప్తు అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.ఈ వ్యవహారంపై ప్రాథమిక దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

గంగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



ములుగు జిల్లా/ కన్నాయిగూడెం, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగూడెం గ్రామానికి చెందిన పూనెం కొమ్రాక్కకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాంబాబు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారు పూనెం కొమ్రాక్క మాట్లాడుతూ.. తమలాంటి నిరుపేద కుటుంబాన్ని గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి సీతక్కకు, మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి మంజూరుతో తమ కుటుంబానికి ఎంతో భరోసా లభించిందని, కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోడెం నర్సింహారావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోట నాగేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ప పగిడయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సునార్కని నారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సునార్కని రాంబాబు, బీసీ సెల్ నాయకులు కటకం మల్లయ్య, పూజారి సత్యనారాయణ, మండల నాయకులు ఆలం రాంబాబు, సమ్మయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు కుమ్మరి కుమార్, జాడి బైరేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ కార్యకర్తకు కాంగ్రెస్‌లో గుర్తింపు



హన్మకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తకు కీలక బాధ్యత దక్కింది. ఎల్కతుర్తి మండలానికి చెందిన ఎలిగేటి ఇంద్ర సేనారెడ్డి ఎల్కతుర్తి విశాల సహకార సంఘం సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో గురువారం సాయంత్రం ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు నూతన పాలకవర్గం కూడా బాధ్యతలు స్వీకరించనుంది. ఇంద్రసేనారెడ్డి రాజకీయ ప్రస్థానం కార్యకర్తగా ప్రారంభమైంది. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. పార్టీ అభ్యర్థులు లేని సందర్భాల్లోనూ నాలుగు గ్రామాల్లో ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ కోసం ఆయన చూపిన చొరవ, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసిన తీరును గుర్తించిన కాంగ్రెస్ నాయకత్వం ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. మండల అధ్యక్షుడిగా పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తరించడంతో పాటు అధిష్టానం ఇచ్చిన పిలుపులను విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉన్న సమయంలోనూ ఇంద్రసేనారెడ్డి పార్టీని వీడకుండా కార్యకర్తలకు అండగా నిలిచారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి. నిరసనలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రజా సమస్యలపై చేపట్టిన కార్యక్రమాల్లో కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఎల్కతుర్తి మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషించారని నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేశారని పేర్కొన్నారు.

నూతన పాలకవర్గం

సింగిల్ విండో చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డితో పాటు డైరెక్టర్లుగా శనిగరపు స్వరూప, ఎడవెల్లి అశోక్‌రెడ్డి, తంగళ్లపల్లి కొమురయ్య, పుల్లూరి నరసింహారావు, బొమ్మనబోయిన కుమారస్వామి, చిర్ర రాజయ్య, చల్ల ధనలక్ష్మి , మద్దె రాములు, మెడెం రాజయ్య, ఇనుగుల సుధాకర్, తిరుపతి బక్కయ్య, వీరమల్ల ముకుందారెడ్డి ఎన్నికయ్యారు. నూతన చైర్మన్, పాలకవర్గం సహకార సంఘాన్ని బలోపేతం చేసి రైతులు, సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



వరంగల్ జిల్లా / సంగెం, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సంగెం మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఐలమ్మ పోరాటాన్ని స్మరించుకున్నారు. భూమి, భుక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని నాయకులు కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేర్ల లలిత రమేష్, సబ్‌ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కందగట్ల నరహరి, సంఘమేశ్వర దేవాలయ చైర్మన్ ముసుకుంట్ల కోటేశ్వర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి జనగాం రమేష్, సంగెం ఉపసర్పంచ్ ఆగపాటి రాజు, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపెల్లి రమేష్, నాయకులు పులి సాంబయ్య, నల్లతీగల రవి, మాదినేని బాబురావు, మండల రజక సంఘం గౌరవ అధ్యక్షుడు ముసుకుంట్ల మోహన్, ఉపాధ్యక్షుడు అలుగునూరి రమేష్, చాపర్తి శ్రీను, గట్టికొప్పుల ఎల్లయ్య, రావుల సూరయ్య, ముసుకుంట్ల శ్రీను, సూరయ్య, నంగునూరి సాయిలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



జనగామ జిల్లా / పాలకుర్తి, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు నవీన్ మాట్లాడుతూ.. పేదలు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించి ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో ప్రత్యేకమైనదని నాయకులు గుర్తుచేశారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఉండాలి



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథని మండలం గుంజపడుగు గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని గురువారం గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్యా బానేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నుంచి వెలువడే నీరు బయటకు వెళ్లకుండా ఇంకుడు గుంతల్లోకి చేరే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీజారెడ్డి, ఎంపీవో షబ్బీర్ అలీ, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి





వరంగల్ పోలీస్ కమిషనరేట్, లోసెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్, లోసెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల ప్రగతిపై సమగ్రంగా సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి దర్యాప్తు ఏ దశలో ఉందనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిందితులు పరారీలో ఉంటే వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ త్వరితగతిన అరెస్టు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో సాక్ష్యాధారాల సేకరణ అత్యంత కీలకమని పేర్కొంటూ, సంఘటనా స్థలంలో లభించే భౌతిక, సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి భద్రపరచాలని ఆదేశించారు. సీసీ కెమెరాల దృశ్యాలు, మొబైల్, ఇతర డిజిటల్ ఆధారాలు, ఫోరెన్సిక్ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను సమర్థవంతంగా వినియోగించుకుని కేసులను పకడ్బందీగా దర్యాప్తు చేయాలని సూచించారు. దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యం ఇవ్వాలని, జాప్యం కారణంగా కేసులు పెండింగ్‌లో ఉండకుండా ప్రతి కేసుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని తెలిపారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు, తీవ్రమైన నేరాల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సాగాలని ఆదేశించారు.

గణేష్ నవరాత్రులకు పటిష్ట భద్రత

మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన సూచనలు చేయాలని, శాంతియుత వాతావరణంలో వేడుకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ముమ్మర పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీస్ అధికారులకు సూచించారు.

డ్రగ్ కంట్రోల్ సిబ్బందికి అభినందనలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో మత్తుపదార్థాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన డ్రగ్ కంట్రోల్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ రివార్డులు అందజేశారు. సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, డారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్ సింగ్, అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్ కుమార్, శ్రీనివాస్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:14 AM Page 7

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దళిత బాంధవుడు కేసీఆర్ : చదిరం నాగేశ్వరరావు



హనుమకొండ, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : దళితుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని బీఆర్ఎస్ నాయకుడు చదిరం నాగేశ్వరరావు అన్నారు. దళిత బంధు పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో దళితబంధు పథకాన్ని అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సుమారు రూ.145 కోట్ల వ్యయంతో నిర్మించడంతో పాటు, నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం కేసీఆర్ ప్రభుత్వానికి అంబేద్కర్‌పై ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.

కేసీఆర్ నివాసం వద్ద నిరసనలపై ఆగ్రహం

కేసీఆర్ నివాసం వద్ద ఇటీవల జరిగిన నిరసనలపై నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ చావును కోరుకునే విధంగా నినాదాలు చేయడం, దళితులను ముందుపెట్టి ఆయన నివాసం వద్ద నిరసనలు నిర్వహించడం హేయమైన చర్య అని ఆరోపించారు. దళితులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, వారిని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఉసిగొల్పడం సరికాదని అన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి గౌరవం ఇవ్వాలి

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని నాగేశ్వరరావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించలేదని ఆరోపించారు. అంబేద్కర్ ఆశయాల అమలు, దళితుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మరింత కృషిచేయాలని డిమాండ్ చేశారు. దళితులను రాజకీయాలకు ఉపయోగించుకోవడం మానుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఇలాంటి చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా దళితులను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్, ఆరేపల్లి రాజయ్య, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తీక్, శనిగరం వంశీ తదితరులు పాల్గొన్నారు.

జీబ్రా లైన్లా.. వాహనాలకు మరణ శిక్షలా

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి):
రోడ్డు భద్రత కోసం ఏర్పాటు చేసిన జీబ్రా లైన్లే ఇప్పుడు వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంథని–పెద్దపల్లి, మంథని–కాటారం ప్రధాన రహదారులపై కెమికల్ పదార్థంతో ఎత్తుగా ఏర్పాటు చేసిన జీబ్రా లైన్లు వాహనాలు, ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రత కోసమా.. ఇబ్బందుల కోసమా?

సాధారణంగా రహదారిపై స్పష్టంగా కనిపించేలా పెయింట్‌తో జీబ్రా లైన్లు ఏర్పాటు చేస్తారు. అయితే ఆయా రహదారులపై కెమికల్ పదార్థంతో ఎత్తుగా వేసిన జీబ్రా లైన్లను దాటే సమయంలో వాహనాలు ఒక్కసారిగా కుదుపులకు గురవుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో వాహనాల విడిభాగాలపై ప్రభావం పడటంతో పాటు, కొన్ని సందర్భాల్లో వాహనాలు మొరాయిస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

ప్రయాణికులకు కుదుపులు.. డ్రైవర్లకు ఇబ్బందులు

ఎత్తుగా ఉన్న జీబ్రా లైన్లను దాటే సమయంలో వాహనాల్లోని ప్రయాణికులు ఒక్కసారిగా కుదుపులకు గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. వాహన వేగాన్ని తగ్గించినప్పటికీ ఎత్తుగా ఉన్న జీబ్రా లైన్ల కారణంగా కుదుపులు తప్పడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేయడం, డ్రైవర్లను ప్రశ్నించడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.

నాణ్యత.. ప్రమాణాలపై ప్రశ్నలు

వాహనాల వేగాన్ని నియంత్రించి పాదచారుల భద్రతను కాపాడటమే జీబ్రా లైన్ల ప్రధాన ఉద్దేశం. అయితే భద్రత కోసం ఏర్పాటు చేసిన జీబ్రా లైన్లే వాహనాలకు నష్టం కలిగించే స్థాయిలో ఉంటే వాటి నిర్మాణంలో నాణ్యత, ప్రమాణాలు పాటించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన రహదారిపై వారి వాహనాలకే నష్టం, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగే పరిస్థితి రావడం ఎంతవరకు సమంజసమని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలి



మంథని–పెద్దపల్లి, మంథని–కాటారం ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన ఎత్తైన కెమికల్ జీబ్రా లైన్లను ఆర్‌అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట ఎత్తైన జీబ్రా లైన్లను తొలగించి, నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన రహదారి గుర్తులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారా? లేక వాహనదారుల గోడును పట్టించుకోకుండా వదిలేస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణకు బాటలు



హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం కుడా కార్యాలయంలో మట్టి గణేశ్ విగ్రహాలను కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా సంప్రదాయాలను కాపాడటంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర జలవనరులను కాలుష్యం నుంచి రక్షించవచ్చని తెలిపారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమై, జలచరాలు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణేశ్ విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

భక్తితో గణపతిని ఆరాధిద్దాం.. బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం

ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి గణేష్ మండపం మట్టి గణపతులను ప్రోత్సహించి పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ఆదర్శంగా నిలవాలని సుధారాణి కోరారు. అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలందరూ ఈ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, జలవనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని సూచించారు. నీటి ఎద్దడి దృష్ట్యా వీలైనంత తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గతంలో వినాయక విగ్రహాల తయారీకి చెరువు మట్టినే ఉపయోగించి, పూజల అనంతరం అదే చెరువులో నిమజ్జనం చేసేవారని గుర్తుచేశారు. మళ్లీ అలాంటి పర్యావరణహిత సంప్రదాయాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాల వద్ద వీలైనంత తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని, విగ్రహాల విషయంలో పోటీలకు వెళ్లకుండా ఆధ్యాత్మిక దృక్పథంతో నవరాత్రులను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సామ్యా నాయక్, కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీంరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం తాకట్టు పత్రాలతో రూ.59.30 లక్షల మోసం



హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి : నకిలీ బంగారం తాకట్టు పత్రాన్ని సృష్టించి, వాస్తవంగా బంగారం తాకట్టు పెట్టకపోయినా ఉన్నట్లు నమ్మించి గోల్డ్ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.59.30 లక్షలు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఎలిమి సంతోష్ (37), శ్రీమాన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ చైర్మన్, సీఈఓ కాగా.. వడ్డేపల్లి రంజిత్ (39) వ్యాపారిగా ఉన్నారు. పోలీసుల విచారణలో.. సంతోష్, రంజిత్ ఇద్దరూ కలిసి కుట్ర పన్నినట్లు వెల్లడైంది. రంజిత్‌కు చెందిన సుమారు 640 గ్రాముల బంగారం శ్రీమాన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్‌లో తాకట్టు ఉన్నట్లు చూపిస్తూ నకిలీ తాకట్టు రసీదును తయారు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఆ నకిలీ పత్రాన్ని నిజమైనదిగా నమ్మించిన నిందితులు.. బంగారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించకుండానే గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి ద్వారా ఆయన బ్యాంకు నుంచి ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.59,30,000లను శ్రీమాన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ ఖాతాకు బదిలీ చేయించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు హెచ్చరించడంతో.. ఖాతాలో జమ అయిన నగదును ఇతర అవసరాలకు మళ్లించినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల మొబైల్ ఫోన్లు, నకిలీ తాకట్టు పత్రం ప్రతిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ మోసంలో మరెవరైనా ప్రమేయం ఉందా? ఇదే తరహాలో ఇతర గోల్డ్ ఫైనాన్స్ సంస్థలను మోసం చేశారా? అనే కోణాల్లోనూ విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

– ప్రత్యక్షంగా నిర్ధారించుకున్న తర్వాతే లావాదేవీలు

గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు, ప్రజలు నకిలీ తాకట్టు పత్రాలను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. తాకట్టు పెట్టిన బంగారం వాస్తవంగా ఉందా లేదా అనే విషయాన్ని ప్రత్యక్షంగా ధృవీకరించుకున్న తర్వాతే ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని కోరారు.

పారదర్శకంగా కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల లక్కీ డ్రా





ములుగు జిల్లా, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల కోసం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో లక్కీ డ్రా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జి తెలిపారు. గురువారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయ తరగతుల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా కేంద్రీయ విద్యాలయ నిబంధనల ప్రకారమే అర్హతలను పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణ అనంతరం అందుబాటులో ఉన్న సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రధానాచార్యులు సీతారాం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 11.09.26_Layout 1 11-09-2026 09:15 AM Page 8

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రంగసాయిపేటలో ఘనంగా హజరత్ ఖాజా సయ్యద్ అలీషా ఖాద్రి చిస్తి 29వ ఉర్సు



వరంగల్ , రంగసాయిపేట, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ తూర్పు నియోజకవర్గం రంగసాయిపేటలో హజరత్ ఖాజా సయ్యద్ అలీషా ఖాద్రి చిస్తి 29వ ఉర్సు ముబారక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఉర్సు హవేలీ పీఠాధిపతి శ్రీ యెహియా పాషా అలియాస్ షోయబ్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సాదిక్ పాషా, అబ్బూ ఖాన్, సలీం, కాంగ్రెస్ నాయకులు కుచన ఏకాంబరం, మూగ రామ్మోహన్ తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



భూపాలపల్లి, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ సూచించారు. రాజీ పడదగిన నేర కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సంబంధిత కేసులు, బ్యాంకు రుణాల వసూళ్లు, విద్యుత్ చౌర్యం, చెక్కు బౌన్స్, మద్యం సేవించి వాహనం నడపడం, చిన్నపాటి కేసులు తదితరాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. "రాజీ మార్గమే.. రాజమార్గం" అని పేర్కొన్న ఎస్పీ.. చిన్నచిన్న వివాదాల విషయంలో కక్షలు పెంచుకుని సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల కక్షిదారులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బందికి ఎస్పీ సూచించారు. రాజీ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం లభించే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు.

చేతానగర్‌లో ఘనంగా పొలాల అమావాస్య



నిజామాబాద్ జిల్లా / పోతంగల్, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : చేతానగర్ గ్రామంలో పొలాల అమావాస్య పండుగను రైతులు సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పల్లె సంస్కృతి, వ్యవసాయ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి, వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొలాల వద్దకు వెళ్లి భూమాతకు పూజలు చేసి, ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకున్న రైతులు పంటల సాగులో ప్రకృతి, భూమాత ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను కొనసాగించారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువత, రైతులు పాల్గొనడంతో చేతానగర్‌లో ఆధ్యాత్మికతతో పాటు పల్లె సంప్రదాయాల సందడి కనిపించింది.

బీఆర్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసనకు పిలుపు



నిజామాబాద్/ పోతంగల్, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరుతో పాటు ఆ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 11న అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సూచించినట్లు పోతంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పి.శంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత మూడు రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై చర్చిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందన్నారు. అయితే బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులు ధరించి నినాదాలు చేస్తూ సభలో అభ్యంతరకరంగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఆందోళనలో స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించారని, మహిళా పోలీసుల పట్ల కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని శంకర్ విమర్శించారు. ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు బీఆర్ఎస్ విధానాలను నిరసిస్తూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పోతంగల్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పి.శంకర్ పిలుపునిచ్చారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



హనుమకొండ, సెప్టెంబర్ 10 (నిత్యం నిఘా ప్రతినిధి) :
వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. తక్కువ వర్షపాతం కారణంగా నగరంలోని చెరువులు, నీటి వనరుల్లో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో నిమజ్జనానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ హాల్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన గురువారం వినాయక చవితి వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై నిమజ్జన ఏర్పాట్లు, నీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్తు, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైనందున నిమజ్జన ఏర్పాట్లపై ముందుగానే దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని సూచించారు. నీటి మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిమజ్జనానికి అనువుగా నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేయాలని కోరారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లు, ఇతర పరికరాలను ముందుగానే సిద్ధం చేయడంతో పాటు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బంధం చెరువుపై ప్రత్యేక దృష్టి

బంధం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి ముందే చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణను కేవలం వినాయక నిమజ్జనానికి పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని అన్నారు. రానున్న బతుకమ్మ వేడుకలను కూడా దృష్టిలో ఉంచుకుని చెరువుల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, నీటి లభ్యతపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

మండపాలకు ఉచిత విద్యుత్తు

నగరంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్తు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మండపాల విద్యుత్తు కనెక్షన్లు, వైరింగ్‌ను అధికారులు ముందుగానే పరిశీలించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ ఏడాది గతం కంటే ఎక్కువ సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నందున వాటి వివరాలను ముందుగానే సేకరించి అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ

వినాయక మండపాల పరిసరాల్లో ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని నాయిని తెలిపారు. చెత్త తొలగింపు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండపాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అదనపు సిబ్బందిని అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కోరారు. మండపాల సమీపంలో ఆలయాలు, పాఠశాలలు, చర్చిలు, మసీదులు వంటి మత పరమైన, విద్యాసంస్థలు ఉంటే నిర్వాహకులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. శబ్ద వ్యవస్థ వినియోగంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ట్రాఫిక్, వైద్య సేవలకు ముందస్తు ప్రణాళిక

వినాయక చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు, ట్రాఫిక్, జీడబ్ల్యూఎంసీ, విద్యుత్తు, ఆరోగ్య, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందుగానే మార్గ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, నిమజ్జన మార్గాల్లో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి సంవత్సరం చివరి నిమిషంలో ఏర్పాట్లు చేయకుండా ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని నాయిని అధికారులకు సూచించారు. సమావేశంలో ఈవీ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ అబూబకర్, అదనపు కలెక్టర్ రవి, జీడబ్ల్యూఎంసీ, పట్టణ ప్రణాళిక, పోలీసు, విద్యుత్తు, ఆరోగ్య, ట్రాఫిక్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేయూలో నిర్మాణ పనులకు వేగం పెంచాలి



హనుమకొండ / కేయూ సెప్టెంబర్ 10(నిత్యం నిఘా ప్రతినిధి):
కాకతీయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, నిర్మాణ పనులను వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మహిళా వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్, రూసా నిధులతో నిర్మిస్తున్న సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన సెంటర్, రసాయన శాస్త్ర విభాగం నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు చేపడుతున్న రహదారి పనులను వీసీ పరిశీలించారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాలలో ఆధునికీకరిస్తున్న సెమినార్ హాల్, రూసా నిధులతో చేపడుతున్న కంప్యూటర్ సెంటర్, కే-హబ్‌లో కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. పరీక్షల విభాగంలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ కోసం చేపడుతున్న ఏర్పాట్లతో పాటు పబ్లికేషన్ సెల్‌లో నిర్మిస్తున్న స్టోర్ పనులను కూడా వీసీ పరిశీలించారు. ఆయా పనుల ప్రస్తుత పరిస్థితి, పూర్తయ్యే గడువు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులు, సిబ్బందికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, రూసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జునరెడ్డి, రసాయన శాస్త్ర విభాగాధిపతి, పూర్వ అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్. వాసుదేవరెడ్డి, యూనివర్సిటీ ఇంజనీర్ శంకరయ్య తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ, వసతి గృహాల సంచాలకులు డాక్టర్ పి. శ్రీనివాస్, పబ్లికేషన్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎం. నరసింహారావు, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com